
# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**



భోరున కురిసిన వర్షం కాస్త తెరిపినిచ్చింది. తుంపర పడుతోంది. పెద్దలకు భయపడి బోనులో పడిన ఎలుకల్లా ఇళ్లల్లో ఉన్న పిల్లలు వీధుల్లోకి వచ్చారు. ఇరుగు పొరుగు పిల్లలంతా కాగితం పడవలు వదులుతూ కేరింతలు కొడుతూ వుంటే చిన్న పిల్ల రాధ హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. చాలా పెద్దవాన కురిసింది. వెలిసింది.

కానీ ఇంకా ఉన్నాను సుమా అన్నట్లు తుప్పరగా రాలుతున్నది. రోడ్లన్నీ జలమయమైపోయాయి. చూరు నుంచి నీళ్లింకా ధారగా కారుతున్నాయి. మనుషులు ఆ గుమ్మంలోను, ఈ పంచలోను తల దాచుకున్న వాళ్లు తెగించి తప్పనిసరి కనుక రోడ్లమీదకు దిగిపోతున్నారు.

## ఆశల పల్లకి

-వీరాజీ

రాధ వాళ్ల అమ్మ శకుంతల గుమ్మంలో నిలబడి వీధిలో పిల్లల్ని చూస్తూ మురిసిపోయింది. అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా నట్టింట్లోంచి వరండాలోకి వచ్చింది. వస్తూనే 'పాపం! ఈయన పూర్తిగా తడిసిపోయి వస్తారు కాబోలు. రేపటికి ఇస్త్రీ బట్టలు కూడా లేవు' అనుకుంది. కానీ ఆమె చూపంతా ఆరేళ్ల రాధ కోసం గుమ్మంలోనే వుంది.

రాధకి వాన కురియడం వెలిసిపోవడం రెండూ పరమానందంగా ఉన్నాయి. అదీ ఎదురింటి మోహన్, ఇరుగింటి రాజా, పొరుగింటి బాబ్జీ అంతా సంబరంగా కేరింతలాడుతున్నారు.

చూరు నుంచి నీళ్ళు కారి తడిసిపోతున్నాయనిగానీ, నేల కూచుని నీళ్లల్లో పడవలు వేస్తూ వుంటే వెనకాతల గౌనులు, చొక్కాలు నీళ్ళు తాగేస్తున్నాయనిగాని జ్ఞాపకమే లేదా పిల్లలకి.

"రాధా! ఒసేవ్ అమ్మలూ... నిన్నేనే" శకుంతల కేకలకి రాధ పలకలేదు. అసలు వాళ్లీ ప్రపంచంలోనే లేరు. వాననీళ్ళు కాలువలనిండా లొడాలొడా పారుతుంటే అదేదో తమ ప్రజ్ఞలాగే వుంది వాళ్లకి. శకుంతలకి పిల్లల ఆనందానికి అడ్డు పడాలనిపించలేదు. 'తడిస్తే ముక్కులంట నీళ్ళు కార్తాయి. ఇంత మిరియం వేసి చారు కాచేస్తా రేపు' అనుకుంది.

"అదీగాక అవతల గోరుచిక్కుడు కాయలేరుకోవాలి. రాధను ఇప్పుడు కదిపితే అది నా చెవులు పట్టుకుని వూపుతుంది' అనుకుంటూ లోపలకు వెళ్లి చిక్కుడుకాయలేరుకుంటోంది శకుంతల.

రాజు కత్తి పడవ చేసాడు. రాధ పడవ కాస్సేపు చక్కగానే వెళ్లింది. కానీ రాజా కత్తిపడవ దాన్ని చిన్నగా తాకింది. అది కాస్తా కాలువ అంచుకు తగిలింది. నానిపోయింది. వొడ్డుకుపోయింది.

"హాయ్...హాయ్... రాధాయ్! నీ పడవాయ్! నా పడవతో తార్! నాది కత్తి పడవ" అంటూ రాజా వానా వానా చెల్లప్పా తిరగేస్తున్నాడు. రాధకి ఉడుకుమోత్తనం మహా ఇదిగా వచ్చేసింది. కోపంతో రాజాని ఒక్క చెంప దెబ్బ వేద్దామనుకుందిగానీ తన పడవ? తన పడవ మునిగిపోయిందిగా! మరో పడవ కోసం కాగితం ముక్క మడిచింది. బాబ్జీ అది చూసి "ఏయ్ రాధీ! కత్తిపడవ చెయ్యే! రాజాగాడి పడవకి ఢీ ఇద్దాం" అన్నాడు.

"నాకు రాదు" రాధ బిక్క మొహం వేసింది.

"పోనీలే రాజాగాడి జట్టు విప్పేయ్! మనం పోయి చూరుకింద నీళ్లు పట్టుకునే ఆటలాడుకొందాం!" బాబ్జీ సలహా ఇచ్చాడు.

"ఊహూ..."

"మరి? నీకా రాజాగాడంటే ఇష్టం. అందుకే వాడలా ఏడిపిస్తాడు. ఏడూ ఫో" బాబ్జీ పారిపోయాడు.

రాధకి కత్తి పడవ కావాలి. ఎలాగ?

రాజాని ఓడించాలి. వుడికించాలి. ఏడిపించాలి. రాజాని వదిలిపోవడం దానికి పిసరు ఇష్టంలేదు.

'అమ్మ వుందిగా... అమ్మనడుగుతా' ఆ ఊహ తట్టడమే తడవుగా ఛెంగున లేచి పారిపోయింది ఇంట్లోకి రాధ.

విజయోత్సాహంతో గెంతులేస్తున్న రాజాకి కాళ్లు కదలలేదు.

"అరె రాధాయ్ నీకు కత్తి పడవ ఇస్తానే" అంటూ వాడు కూడా రివ్వున ఇంట్లోకి పోబోయి గబుక్కున ఆగిపోయాడు. రాధా వాళ్ల ఇంట్లోకిగాక తన ఇంట్లోకి పారిపోయాడు.

రాధ పరుగెత్తుకొచ్చి "అమ్మా! అమ్మా నాక్కావాలే! కత్తి పడవ నాక్కావాలే" అంటూ తల్లి వీపుమీదకెక్కిపోయింది.

"ఏయ్ మొద్దూ! ఏమిటిది? ఇల్లంతా తొక్కుతున్నావులే! వూ... ఏం కావాలి. రా ఇలా వచ్చి కూచో. కాస్త నాకు ఈ కాయలు ఏరి సాయం చెయ్యి, నాన్న వచ్చే వేళైంది" అంటూనే శకుంతల రాధ చిన్నారి చేతులను తన మెడకు హత్తుకుంది. అవి తీసి ముద్దెట్టుకుంది.

"నాక్కాయితం కత్తిపడవ కావాలీ" రాధ ముందుకొచ్చి గునిసింది.

"పోయి నిన్నటి పేపరు నాన్నారి బల్లమీద ఎడం చేతికేసి ఉంది. తీసుకురా"

రాధ క్షణంలో వచ్చింది.

శకుంతల కాగితం మడిచింది.

"అదికాదే, కత్తిపడవే. పే...ద్దద్దే... మరేమో!"

"అబ్బా ఉండవే. అదే చేస్తున్నాను"

రాధకి రాజా పడవను ముంచాలి. రాజా పొగరణచాలి అన్నదే ఆదుర్దా. దానికి కాలు నిలవడమేలేదు.

కత్తిపడవ అవగానే తీసుకుని పారిపోయింది తుర్రున.


★★★

శకుంతల, కూతురు పారిపోయిన వేపు రెండుక్షణాలు చూసి తాను కూడా



## మధురమైన రోజు

తారలు తాము నటించే చిత్రాలు మంచి హిట్ కొట్టాలనుకుంటారు. అందాలభామ ప్రియాంకాచోప్రా కూడా తాను నటించే చిత్రాల గురించి ఇలాంటి అభిప్రాయంలోనే ఉంటుందిట. ఈమధ్యే 24ఏట ప్రవేశించిన ప్రియాంకాచోప్రా పుట్టినరోజు కూడా వెరైటీగా జరిగింది. నిర్మాత, దర్శకులు ఈమె పుట్టినరోజుని గుర్తుచేస్తూ ఇరవైనాలుగు క్యాండిల్స్ తెచ్చి వెలిగించి పెద్ద కేక్‌ని ఆమె చేత కట్ చేయించారు. భారీగా జరిగిన తన పుట్టినరోజు వేడుకని చూసిన ఈ భామ తన పాపులారిటీ పెరిగిందని భావిస్తోంది.



ఉత్సాహంగా లేచి ఆ వెనుకనే గుమ్మంలోకి వెళ్లింది.

రాధ అర్జెంటుగా కత్తిపడవ కాలువలో వేసింది. కానీ రాజా ఏడి?

'ప్రత్యర్థి లేకుండా గోదాలోపల దిగి ఏం లాభం?' నిరుత్సాహ పడిపోయింది రాధ.

అంతలో రాజా రివ్వున వచ్చాడు.

"రాధాయ్! ఇదిగో నీకే ఈ కత్తిపడవ" వాడు కష్టపడి వాళ్లన్నయ్య డ్రాయింగ్ పుస్తకం చింపి చేసి తెచ్చిన కత్తిపడవనిచ్చాడు.

'నాది చూడు ఎంచక్కా ఉందో. ఛీ! నీదేం కాదు. మా అమ్మ ఇంత ఇంత మంచిగా చేసింది" గర్వంగా తన పడవను చూపించింది రాధ.

రాజాకి ఏడుపే వచ్చింది.

"అయితే ఈ పడవ వొద్దా?" అక్కసుగా అడిగాడు.

"ఊహూ..."

"వొద్దా... వొద్దా... పారేయ్‌నా? చింపేయనా?"

"నీ ఇష్టం. కావాలంటే దాచుకో. నాకు మా నాన్నారి పేపర్లెన్ని ఉన్నాయో..మా అమ్మ బోలెడు కత్తిపడవలు చేస్తుంది" రాధ అటు తిరిగి కూర్చుంది పాదాలమీద.

రాజాకి ఏం చేయాలో రెండు నిముషాలు పాలుపోలేదు.

"సరే పడవలకేంగానీ నేను నిజంగా పెద్దాణ్ణి అయి విమానం నడుపుతా తెలుసా?"

"అబద్ధాలు" అంది వెంటనే ఇటు తిరిగి రాధ.

"కాదు. మా నాన్నారిని అడుగు. నాకు అన్నయ్యంత అవగానే కలకత్తా, బొంబాయిలకి పంపేసి విమానం నేర్పుతామన్నారు"

రాధకి రాజా నాన్నగారు కూడా అబద్ధాలాడతాడనిగానీ, అబద్ధాలు ఆడే అవసరం ఆయనకు క్కూడా కలుగుతుందనిగానీ తోచలేదు. కాస్త ఆశగా "విమానాలు మనూర్లో ఉండగా అక్కడికెందుకు?" అంది.

"మన వూరి మీదుగా వెళ్లేవి మంచివి కావు. అవి అక్కడ ఆగవు" అన్నాడు రాజా.

"అయినా నాకొద్దు. నువ్వు నన్ను బాబ్జీ దగ్గర, సుశీ దగ్గర గోల చేసావు" అసలు కారణం చెప్పేసింది రాధ.

"అందుకేగా పెద్దాణ్ణి అయి విమానంలో ఎక్కిస్తాను అనే మాటిస్తున్నాను" రాజా తన కత్తిపడవను రాధకి అందీ అందకుండా పట్టుకున్నాడు.

"అక్కర్లేదు. ఆ పడవ ఇలా ఇయ్యి చింపి పారేస్తా" అంది రాధ.

రాజా ఇచ్చేసాడు. రాధ వెంటనే నలిపేయలేదు. నలిపేద్దామనుకుని మానేసింది.

రాజాకి తన సర్వస్వమూ రాధ చేతుల్లో ఉండడమేగాక రాధ పడవను నలిపేస్తే కలిగే చిన్నతనం ఎంత ఎక్కువో కూడా తెలిపే భావం మొహంలోకి వచ్చేసింది.

రాధ ఆ పడవను జాగ్రత్తగా నీళ్లల్లోకి వదిలేసింది. రాజాకి మొహం వెలిగింది.

"మరీ...నువ్వు విమానం ఎక్కి పెద్ద చదువులకి వెళ్తావా?" రాధ అడిగింది రాజా కళ్లల్లోకి కుతూహలంగా చూస్తూ.

"విమానమే నేను నడుపుతానుగదా. మళ్లీ బళ్లోకి ఎందుకూ?" రాజా ప్రశ్న.

"అమ్మ చెప్పింది. మాకో చిన్నాన్న ఉండేవాడట. అతను విమానం ఎక్కి పై చదువులకని..." రాధకి వూరి పేరు జ్ఞాపకం రాలేదు. "పై చదువులకనీ...కనీ...పై చదువుల..." బుర్ర గోక్కుంటోంది. వాళ్ల చిన్నాన్న ఏ వూరెళ్లాడో మర్చిపోయింది రాధ.

"అబద్ధాలు" రాజా కొట్టిపారేసాడు.

"ఫో...ఫో...నేనబద్ధం ఆడను. కావాలంటే మా అమ్మనడుగు. ఆ చిన్నాన్న విమానంలో వెళ్లి ఒక తెల్ల దొరసానిని తెచ్చుకున్నాట్ట"

"అంటే..." రాజాకి నోరు అంతా విప్పేసినా ఆశ్చర్యం తీరలేదు.

"అంటే...గౌను వేసుకుంటారు పెద్దాళ్లూ. ఇలా ఎత్తుగా జోళ్లు వేసుకుని నడుస్తారు"

"ఓహో...అయితే నేనూ తెచ్చుకుంటా. మీ చిన్నాన్నదేనా మహాగొప్పా?" రాజాకి అదేదో చాలా సాహసమైన కార్యమనిపించింది.

శకుంతల ఇక వినలేకపోయింది వాళ్ల మాటలు.

"రాధా ఇలారా" అరిచింది గట్టిగా.

ఉలిక్కిపడింది రాధ.

కూతురు దగ్గరకు రాగానే రెక్క పట్టుకుని నట్టింట్లోకి లాక్కెళ్లి అక్కడ కూర్చోబెట్టి చేతుల్లో అక్కడే పడివున్న ఎక్కాలపుస్తకం కుక్కి "చదువు ముందు పాజీకానా" అంది శకుంతల ఆవేశంగా.

రాధ ఏడుపు లంకించుకుంది.


## డాక్టర్‌గారి నిర్వాకం

అలమేగా కౌంటీలో ఒకరోజున 45ఏళ్ల ఫెడిరికో కేస్ట్రోమారే అనే డాక్టర్ ఫుల్‌గా తాగి హాస్పిటల్‌కి వచ్చాడట. ఆ టైంలో కాలి చీలమండలు విరక్కొట్టుకుని వచ్చిన ఒకతనికి ఆపరేషన్ కావాల్సి ఉంది. డాక్టర్ పరిస్థితి చూస్తే పేషెంటుకి ఆపరేషన్ సరిగా చేసేలా లేదు. ఆపరేషన్‌ని వాయిదా వేసినా ఫర్వాలేదని గుర్తించిన అసిస్టెంట్లు డాక్టర్‌తో అదే మాట చెప్పారు. 'వీల్లేదు పేషెంటు చచ్చిపోతాడు' అని ఆ డాక్టరు పట్టుబట్టాడు. అది ప్రమాదమని నర్సు అడ్డుకుంది. తాగుడు మత్తులో అక్కడి సర్జరీ సామాన్లు అవీ ధ్వంసం చేయడమే కాకుండా ముష్టిఘాతంతో నర్సుని కొట్టబోయాడు డాక్టర్. ఇక లాభం లేదని పోలీసుల్ని పిల్చింది నర్సు. వాళ్లొచ్చి డాక్టర్ని అరెస్ట్ చేశారు.

## చేదు నిజం

గత రెండు దశాబ్దాలుగా పంజాబ్‌లో ఆడపిల్లలు పుట్టకుండా భ్రూణ హత్యలకి ఒడిగట్టే తల్లిదండ్రులున్న నేపథ్యంలో ఆడపిల్లలు పుట్టుకలు తగ్గిపోతున్న కఠిన వాతావరణంలో పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన రీసెర్చిలో ఒక చేదునిజం తెలిసింది. నేడు 42శాతం మంది ముసలి తల్లిదండ్రుల్ని దగ్గరికి చేరదీస్తున్నది కూతుళ్లయితే, కేవలం 24శాతం మంది కొడుకులే తమ తల్లిదండ్రుల్ని సాకుతున్నారట. ఇది ఒక ఊరి సంగతి కాదు. లూథియానా జిల్లాలో 12గ్రామాలలో 300కుటుంబాలని సర్వే చేసి తెలుసుకున్న కఠిన సత్యం.

-తటవర్తి



శకుంతలకి కోపం తీరలేదు.

***

సరిగ్గా తన ఎనిమిదో ఏట రాధకి ఇవాళ చిన్నాన్నగా తను చెప్తే తెలిసిన శంకరం కూడా శకుంతలతో ఒక వాన కురిసి వెలిసిన రోజున ఇలాగే కాగితం పడవలాట ఆడాడు.

శంకరం బావ అంటే శకుంతలకు పంచప్రాణాలూను. శంకరం బావ ఆరో క్లాసు చదివేవాడు అప్పుడు.

"నేను నిన్ను విమానంలో లండన్ తీసుకువెళ్తాను శకూ" అన్నాడు శంకరం బావ. అలా ఎన్నోసార్లు విమానం ఎక్కిస్తానన్నాడు శంకరం బావ. శకుంతల నమ్మింది. శకుంతలకి స్కూలు ఫైనల్ పరీక్షలన్నీ రాసి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత కూడా కలలో శంకరం బావ, తనూ విమానంలో లండన్ వెళ్ల డమే అగుపించింది. అప్పటికి శంకరం బావ విదేశాలకు వెళ్లడానికి స్కాలర్‌షిప్పుల వేటలో ఉన్నాడు.

శకుంతల వాళ్ల అమ్మానాన్న మాట ఎలా వున్నా శకుంతలకు మాత్రం శంకరం బావ తన కోసమే విదేశాలకి, విమానాలకి ఎగబడుతున్నాడని తోచింది.

శంకరం బావతో తను తెగ తిరిగేది. ఎవరేనా ఏమైనా అంటే తిరగబడి కేక లేసి "మా బావ, నా ఇష్టం" అనేది. అయితే "ఈడొచ్చిన పిల్లవు, నీకు పెళ్లి అవ్వద్దా?" అన్నవాళ్లూ ఉండేవారు కనుక శంకరంతో తను ఆఖరి రోజుల్లో చనువు తగ్గించింది.

చివరకు ఒకనాడు శంకరం లండన్ ప్రయాణ సన్నాహాల్లో ఉండగా అడిగే సింది కూడా "బావా! నన్ను విమానం ఎక్కించవా?" అని.

"చూద్దాం శకూ. నన్ను వెళ్లిరానీ" అన్నాడు బావ.

కానీ బావ వెళ్లివచ్చాక శకుంతలను మరి చూడనేలేదు. దొరల పిల్లను తీసుకువచ్చేసాడు. శకుంతలకి తల తీసినట్లయింది. శంకరాన్ని చంపి తాను చచ్చిపోదామనుకుంది. కానీ ఏమీ చేయలేదు.

అమ్మానాన్న సంబంధాలు వెతుకుతూ వుంటే వూరుకుంది.

చివరికి తల్లితో అన్నది కూడా "అమ్మా! నాకు విమానం ఎక్కాలనుందే" అని.

తల్లి గ్రహించింది.

"తల్లీ! ఏ నోము నోచామో అదే వస్తుందిగానీ.. మనం విమానాలంటే ఎలాగా. విమానాలవాడు నీకు మనసిస్తాడా? వద్దు వద్దు" అంది.

"కాదే...మరొకరెవ్వరైనా అయితే ఆ శంకరం బావ పొగరు అణగదే" అంది తెగించి శకుంతల.

శకుంతల పట్టుదల, అభిమానం, బాధ అలాంటిది. శకుంతల కోరినట్లు విమానం కాదుకదా కారెక్కే మొగుణ్నైనా వెతకలేకపోయారు వాళ్ల అమ్మానాన్న. సరిగ్గా అలాగే రాధక్కూడా కాగితం పడవలు కట్టడం జరక్కూడదు అనుకుంది శకుంతల పిచ్చిగా తన అనుభవాన్ని రాధ విషయంలో అన్వయించుకుంటూ.

***

అంతలో జగన్నాథం సైకిల్ దిగుతూనే "శకుంతలా! రాధ ఎందుకేడుస్తోంది?" అని కేకేసాడు.

శకుంతల ఉలిక్కిపడింది.

రాధ రివ్వున పోయి తండ్రికి ఫిర్యాదు చేసింది.

అంతా విని కూతుర్ని ఎత్తుకుని బుజ్జగిస్తూ జగన్నాథం "ఏమయ్యా నేరస్తుడా! ఔనా?" అన్నాడు నవ్వుతూ భార్యను వీక్షించి.

"ఔను...దానికీ నాకూ విమానాలెక్కేవాళ్లెవరొస్తారు? అందుకే ఇప్పట్నించి ఖాయిదా పెడుతున్నా" అంది శకుంతల అక్కసుగా.

"ఏమో! నా కర్మ కాలి నేను సైకిలెక్కానుగానీ దీనికి మీ శంకరం బావ లాంటివాడు రాకూడదా?" అన్నాడు జగన్నాథం కూతుర్ని క్రిందకు దింపి భార్యను ఓరకంట చూసి.

"వద్దు వద్దు. అలా కాగితం పడవలాట ఆడడం, పక్కింటి ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గారి కుర్రాడితో జత కట్టడం...పైగా అన్నింటికీ మీతో ఫిర్యాదు చేయడం ఇవేమీవద్దు" శకుంతల నవ్వుతూ అన్నదికానీ అందులో బాధకూడా వుంది.

జగన్నాథానికి కొంత అర్థమయింది. కొంత అర్థంకాలేదు,. బట్టలు మార్చుకునేందుకు ఉపక్రమిస్తూ "సరే! ఏలినవారి దయ. రాధకి కూడా ఓ నాలాంటి గుమస్తాగాడినే రమ్మని కోరు నీ దేవుణ్ని" అన్నాడుగానీ మనస్ఫూర్తిగా అనలేకపోయాడు. ఎక్కడో ఆశ... రాధకి గొప్ప సంబంధం వస్తుందని.

★



## బెస్ట్ ఫ్రెండ్

స్నేహితులతో గడిపేరోజులు ఎంతో హాయినిస్తాయి. మంచి స్నేహితుడు దొరకడం కూడా అదృష్టమే. అందుకే మంచి స్నేహితుడిని పొందిన జన్మ ధన్యం అంటారు. కష్టమొచ్చినా, సంతోషం వచ్చినా స్నేహితుడితో పంచుకుంటే ఎంతో బాగుంటుంది అంటోంది ఆర్తీ అగర్వాల్. ప్రమాదం నుంచి బయటపడి సునీల్ హీరోగా నటిస్తున్న అందాలరాముడుతో జనం ముందుకి వచ్చిన ఆర్తీ అగర్వాల్‌కి ఆమె తండ్రే బెస్ట్ ఫ్రెండ్‌ట.

